# డా॥ బి.డి.శర్మ సంస్మరణసభ

**ఒంగోలు, 20-12-2015 :**

రైతుల ఆత్మహత్యలకు రుణభారం ప్రధాన కారణంగా వుందనీ, వడ్డీ వ్యాపారుల దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాడాలని డా॥ బి.డి.శర్మ ఇచ్చిన పిలుపును స్వీకరించటమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్.స్వామి అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, పీడిత, గిరిజన ఉద్యమాల శ్రేయోభిలాషి డా॥బి.డి.శర్మ సంస్మరణసభ రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో నగరంలోని ఈమనిపాలెంలో జరిగింది. కా॥ స్వామి తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ డా॥ బి.డి.శర్మ గాంధేయవాది ఐనప్పటికీ పీడిత ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడేందుకు ఆయనకు గాంధేయవాదం అడ్డుకాలేదన్నారు. ప్రపంచీకరణ పేరుతో వ్యవసాయరంగం మీద జరుగుతున్న దాడి, భారతీయ జీవన విధానం మీద దాడిగా ఆయన అభివర్ణించారని తెలిపారు. "హమారా గాంవ్ – హమారా రాజ్" అనే డా॥ బి.డి.శర్మ నినాదం 'అధికారాలన్నీ సోవియట్లకే' అన్న లెనిన్ సిద్ధాంతాన్ని, గాంధీ గ్రామ స్వరాజ్య సిద్ధాంతాన్ని పోలివుందన్నారు. పార్టీలకు, సంఘాలకు అతీతంగా దేశంలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలన్నింటికీ బి.డి.శర్మ అండగా నిలిచారని కొనియాడారు. వడ్డీ వ్యాపారం విషయంలో బ్రిటీష్ ప్రభుత్వం రూపొందించిన చట్టాలను కూడా నేటి పాలకులు అమలుచేయడంలేదని, దాని ఫలితమే నేటి కాల్‌మనీ దుర్మార్గాలని కా॥ స్వామి స్పష్టంచేశారు. రైతుకూలీల ఉద్యమాలకు డా॥ బి.డి.శర్మ అందించిన తోడ్పాటు, నేటి ఉన్నతాధికారులందరికీ ఆదర్శనీయమని ఆయన కొనియాడారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ ఎస్.లలితకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కా॥ కోదూరి కోటేశ్వరరావు, సహాయకార్యదర్శి కా॥ పరిటాల కోటేశ్వరరావు, ఏఐఎఫ్‌టియు(న్యూ) జిల్లా నాయకులు కా॥ ఎం.ఎస్. సాయి, కత్తి పేరయ్య; బిఎస్ఎన్ఎల్ ఉద్యోగసంఘ నాయకులు కా॥ విజయకుమార్, ప్రగతిశీల ప్రజాతంత్ర మేధావుల వేదిక కన్వీనర్ పంగులూరి గోవిందయ్య, జనసాహితి రాష్ట్ర నాయకులు డా॥ జి.వి.కృష్ణయ్య ప్రసంగించారు.

**గుంటూరు, 19-12-15 :**

డా॥ బి.డి.శర్మ సంస్మరణసభను రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో స్థానిక శ్రామికనగర్‌లో నిర్వహించారు. ఈ సభకు సంఘం జిల్లా నాయకులు కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్. స్వామి, సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ వెంకటస్వామి తదితరులు మాట్లాడుతూ డా॥ బి.డి.శర్మ వంటి ప్రజాతంత్రవాదుల ఆవశ్యకత ఈనాడు ప్రజా ఉద్యమాలకు ఎంతో ఉందన్నారు. 2001లో గుంటూరులో జరిగిన రైతుకూలీసంఘం రాష్ట్ర మహా సభలలో డా॥ బి.డి.శర్మ చురుగ్గా పాల్గొన్న సందర్భాన్ని గుర్తుచేసుకొని ఆయనకు నివాళులర్పించారు.

ooooo